# మెఱుపులు : ఉగాది

- వేమూరి వేంకట రామనాథం

"నూతన సంవత్సర దినం ప్రతి మానవుని జన్మదినం" అన్న వాక్యం ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఛార్లెస్ లాంబ్ వ్రాక్రుచ్చాడు. ఇది చూపునకందిన వెంటనే, మొదలు తుదలేని కాలవాహ్యాళిలో ఒక దినానికి ప్రజ ప్రత్యేక సారస్యం కల్పించుకొని ఆనందంతో గడుపుతా రన్న సాధారణ - అనుభవ విషయం మనసులో గలగల మని యీ వ్యాసానికి ఉత్సాహం కలిగించింది. ప్రతియేడు వచ్చేదే నూతన సంవత్సరాది. అలాగే అనువత్సరం వచ్చేదే వ్యక్తి యొక్క జన్మదినం. ఈ రెండవది ఆవ్యక్తి ఆనందంతో అనుభవిస్తాడు; బహుశః కొందఱు దగ్గఱి బంధువులు, మిత్రులు కూడ ఆ ఆనందం పంచుకుంటారు. అతడు ప్రసిద్ధి చెందిన జీవి అయితే ఆసంతోషం ఎందఱో యితరులు కూడ పొందుతారు; రాజకీయ ప్రాముఖ్యం ఉన్న మనిషి అయితే అతని పుట్టిన దినం ప్రజాబాహుళ్యం తమ కందఱకు ఉత్సాహం కలిగించే ప్రత్యేక సందర్భంగా ఉవ్విళ్ళూరుతారు.

ఇక సంవత్సరాది యున్న దినమో, ఏ ఒక్కరి స్వసందర్భమో కాకుండా, దానిని మించినట్లు జనులందఱు తమకు చెందిన ప్రత్యేక దినంగా, వైయుక్తిక విభేదాలకు తావులేని రీతిగా ప్రఫుల్లమనోవికాసంతో చెలరేగుతూ సంతోషంలో మునిగి యుంటారు. ఈ సాంఘిక - అనుభవానికి ప్రముఖమైన ఉదాహరణ న్యూయార్కులో టైమ్సు స్క్వేర్ లో నూతన సంవత్సరాగమన క్షణంలో ఆకాశం నుండి (అన్నట్లు) క్రిందకు మెల్లగా - ఒక సెకండు కూడ తప్పకుండా -దిగే వెలుగు బంతి! ఇది గమనించటానికి ఎందఱు జనులు మూగుతారో! బైట వాతావరణం ఎలాఉన్నాసరే! ఇటీవలి (2008 డిసెంబరు 31 అర్ధరాత్రి) మంచు కుప్పలనేలపై, చలిగాలి జోరుగా తవులుతున్న అర్ధరాత్రి - "మామూలు" ప్రదేశంలో ఎందఱు జనులు ఆహ్లాదప్రేరితులై గుమిగూడారో! ఆగుంపు వెచ్చందనానికి నోచుకోని వారు టి.వి. లో ఈ సన్నివేశం గమనించియే యుంటారు, సరిగా రాత్రి రెండు జాములయ్యే సరికి తమదేదో నూతనానుభవం చిగిరించినట్లు ఎవరి ఆసనంలో వారు అపూర్వసంతోషంతో ఎగిరి పడుతూ -

ఇది ప్రపంచానికి, భూమికి నూతన సంవత్సరాగమనం కాని మన మందఱం అది యేదో మన సొంతపండుగ అయినట్లు ఉల్లాసం చెందుతాముగదా! ఎవరికి వారు ఇది తమ జన్మదినం అన్నట్లు అవ్యక్త సంతుష్టిని పొందుతారు. దీనికి తనస్వంత పుట్టినదినం పండుగకు భేదం ఏమంటే, ఇందులో ఎందఱో - తనకు తెలిసినవారు, అంతకన్న ఎక్కువగా తెలియనివారు, తన పరిసరాల వారే కాక అన్ని స్థలాల వారు, తనభాష పలికేవారేకాక అన్ని బాసలు ఉచ్చరించేవారు, తన మిత్రులేకాక తన మైత్రితో సంబంధం లేని ప్రజాబాహుళ్యం - సంతోషంతో ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. తన స్వయం ప్రయత్నం లేకుండా, ఆపండుగ ఏర్పాటుకై తన శక్తిగాని పూచీగాని అక్కఱ లేనట్లుగానే, ఆ శుభసన్నివేశం ఎందఱో అనుభవిస్తారు. ప్రతివ్యక్తి యిది తన పుట్టినరోజు వంతుగా క్రొత్త ఉత్సాహం పొందుతాడు.

నూతన సంవత్సర ప్రథమదినానికి ఒక వ్యక్తి యొక్క జన్మదినానికిగల ఒక విశిష్టమైన సాదృశ్యం గమనించుదాం. సాధారణంగా తన పుట్టినరోజు నాడు తన రాబోయే సంవత్సరంలో ఏయే క్రొత్త పద్ధతులను ఆచరణలో పెట్టనెంచుతాడో, ఏయే వెనుకటి అలవాట్లకు స్వస్తిచెప్పవలెననుకుంటాడో, తన మిత్రవర్గంలోను వారితో తనకు గల దైనిక సంబంధాలలోను ఏయే మార్పులు ఉచితం అనుకుంటాడో, - ఈ విధమైన స్వీయ విషయాల సందర్భంలో వలసిన నూత్నతకు తన సానుకూల్యం హృదయపూర్వకంగా ఉద్ఘాటించుకొని, ఆమార్గాలలో సంచరించటానికి నిశ్చయించు కొంటాడు. ప్రతివాడు ఈవిధంగా నిర్ణయాలు తీసికొంటాడని అనలేముకాని, ఈ పద్ధతి ప్రవర్తన సాధారణంగా జనబాహుళ్యంలో విదితమవుతుంది. ఈ విధంగానే నూతన సంవత్సరం మొదలవుతున్న సందర్భంలో కూడ చాల మంది విశిష్టంగానో అవ్యక్తంగానో "ఇక" తమ అలవాట్లలోను, ప్రవర్తన విధానంలోను "ఇలాయిలా" మార్పులు ప్రవేశపెట్టుకుంటామని సంకల్పిస్తారు. ఈ నిర్ణయం నలుగురి యెదుట దృఢంగా మ్రోగించనక్కఱలేదు, ఎవరి మనసులో వారే యీ క్రొత్తదనానికి "నేటి" నుండి పునాది అని తలపోస్తారు. ఈ సమానంతర-మానవ-దృక్పథం నూతన సంవత్సరాదిలోను స్వీయ జన్మదినం వేళను ప్రస్ఫుటంగా గమనించగలం. ఒక చిన్న సవరణ: కొందఱు "అపుడు" గాని, "యిపుడు" గాని ఇలాంటి ఆచరణ -మార్గ-చర్చ చేయనే చేసి కొనక పోవచ్చును. సాధారణంగా ఈ రెండు దినాలు అలాంటి పరిణామాలను గుఱించిన స్వీయప్రతిజ్ఞను సమానాంతరంగా ప్రోత్సహిస్తాయి. ఎవరి పుట్టిన రోజునాడు వారు తమ భావివర్తనను గూర్చిన క్రొత్తందనాలను గూర్చి ఆలోచనలు సలిపినా లేకపోయినా, నూతన సంవత్సరం ప్రారంభమైన నాడు, "నలుగురితో పాటు నారాయణ" అన్న

సామెతకు అనుగుణంగా నన్నట్లు "ఇకనుండి" "ఇలాఇలా" అనే చింతన ఏకొంతగా నైనా మనసులో తళుక్కు మంటుంది.

నూతనసంవత్సరారంభదినానికి ఒక వ్యక్తి యొక్క జన్మదినానికి గల పోలికలలో ఒక గమనీయమైన అంశం ఏమంటే, మన పండుగు లెన్నింటి సందర్భంలోనో ఏదో పూర్వ వృత్తాంతం దైవసంబంధమైనది ఉంటుంది కాని ఉగాది, జన్మదినం, విషయంలో అలాంటిది ఉండదు. ఉదాహరణకు, దీపావళి పండుగు వెనుక నరకాసురుని కృష్ణుడు, సత్యభామ సంహరించటం ఉంటుంది. విజయదశమి సందర్భంలో కాళి మహిషాసురుని వధించటం వృత్తాంతం ఉంటుంది. ఉగాదికి కారణం కాని, ఆనాటికి సరియైన వెనుకటి యేదో దినాన జరిగిన మహద్విశేషం గాని లేదు. దానికి హేతువు గడితప్పకుండా గిఱ్ఱున తిరిగే కాలచక్రం యొక్క పరిభ్రమణ మాత్రమే. ఒక వ్యక్తి యొక్క జన్మదినం లాగా అది కూడ కేవలం కాలం యొక్క వయస్సును ప్రతిబింబిస్తుంది. అయితే ఒక వ్యత్యాసం ఉంది. ఒక మానవుని జన్మదినాలు వస్తూయున్న కొలది వానిలో వార్ధక్యం క్రమ్ముతూ ఉంటుంది, పుట్టిన రోజును ఆనందించే ఉత్సాహం శరీరధార్ఢ్యం వానిలో క్రమంగా తగ్గి పోతూఉంటాయి. భువనానికి నూతన సంవత్సరం వచ్చిన కొలది దాని యౌవనంలో తగ్గుదల అన్నది ఉండదు. అలాంటి ఉగాది దినాలు అనంతంగా వస్తూనే ఉంటాయి. అందలి వైభవం ఆనందించేది వయసు క్రమంగా మళ్ళుతున్న ఒక వ్యక్తి కాదు. వయసుతో పని లేకుండా నిరంతర నూతనత్వానికి కనులు తెఱుచుకొని యున్న జీవకోటి. ఆపండుగుకు ఏ ప్రత్యేక వ్యక్తి యొక్క దినసంచలనం తోను పనిలేదు. మానవకోటి యొక్క నిరవధికమైన ఉత్సాహమే దాని శోభకు కారణం.

నూతన సంవత్సరాదిని ఒక వ్యక్తి యొక్క జన్మదినంతో సమసారస్యంతో పోల్చే సారస్వతచమత్కృతిలో కొంత భావ అసమాన త్వం ఉంది. ఇది గమనించి యీ పోలికను ప్రబంధ-ఉపమగా **(simile)** మనం పరిగణించాలి. అనగా ఈ ఉపమాలం కారం కొంతవఱకే సంపూర్ణసవ్యత్వం కల్గియుంటుంది. ఎలా అనగా: రెండు కాలవిశేషాలు ఏడాది కొకసారి మాత్రమే దర్శనమిస్తాయి. రెంటిలోని అంతర్గత భావవిశేషం ఒకటే: తిరిగితిరిగి వచ్చే - మనం ఊహించే పరిస్థితి ప్రత్యేకత ఉన్నది. ఏడాది కొకనాడే యీ "పండుగ" వస్తుంది; మఱునాటికి అది "నిన్న" జాబితాలో చేరిపోతుంది. ఇది ప్రకృతి కొలిచి ఆవిష్కరించినట్లు సరిగా సంవత్సరాని కొక మారు అదే తేదీలో లేకతిథిలో - దర్శనమిస్తుంది. దాని ప్రశస్తి సరిగా ఒక ఏడాది పాటు, అంతే; ఎవరు గుర్తుచేయ నక్కఱ లేకయే సాలుచివర మఱొక సంవత్సరాది - అలాగే జన్మదినం - అవతరిస్తుంది. ఈ భౌతిక -అంశాల నటుంచి, రెంటి అంతర్గత విశేషాలలోను ఒక ప్రత్యేకత ఉంది. "ఇక ఏదో క్రొత్త" - ఆశాప్రాయంగా - "మఱింత మంచి" దిన పరంపర మనకు ప్రత్యక్షమవుతుంది అన్న అభిప్రాయం మనుష్యులలో కలుగుతుంది. అయితే ఇక్కడ ఒక అసమానత ప్రత్యక్ష్యమవుతుంది. సంవత్సరాది సందర్భంలో జనులందఱు తమతమ ప్రత్యేక, వైయుక్తిక పరిస్థితులకు మించిన ప్రజాబాహుళ్య ధ్యేయాలను గూర్చి, సంభవత్వాలను గూర్చి ఆలోచిస్తారు, తమతమ ప్రార్థనలు - వాంఛలు - కూడ సమస్త ప్రజాపరంగా, లోక కల్యాణపరంగా - ఉంటాయి. "స్వ" చింతన మించిన భావ వైశాల్యం, ఆలోచనా నైర్మల్యం జనులలో తాండవ మాడుతుంది. "తన" జన్మదినం నాడో, తన తన మనస్సు రానున్న కాలంలో తన మంచి కొఱకు ప్రధానంగా ప్రకృతిని భగవంతుని ప్రార్థించటం ముఖ్యంగా మనకు గోచరిస్తుంది. తన హృదయం, బుద్ధిసామరస్యం విశాలశ్రేయో ముఖంగా ప్రసరించ గల్గినవారు మాత్రం ఆనాడు కూడ విశ్వకల్యాణం కోసం ప్రార్థనలు సలుపుతారు.

వ్యాస సమాప్తిలో ఒక ప్రత్యేక విశేషం పేర్కొంటాను. కొద్దిమందికి - అతి స్వల్పసంఖ్యాకులకు - సంవత్సరాది, స్వంత జన్మదినం రెండు ఒకనాడే సంభవిస్తాయి; నూతన సంవత్స రారంభంలో జన్మించిన వారికి! ఇటీవలి (2009) సంవత్సరాదిని - జనవరి ఒకటిన - నూతన ప్రథమదినం ఆరంభమైన 9 సెకండ్లకు ఒక శిశువు పుట్టినట్లు చిఱునవ్వుతో టి.వి. వారు పలికారో లేదో వెంటనే మఱొక శిశూద్భవం 8 సెకండ్లకే కల్గిందని మఱొక వార్త వచ్చింది. ఇది అందఱి చెవుల పడిన క్షణంలోనే ఇంకొక "తాజా" వార్త టి.వి. వారే ప్రకటించారు, సరిగా రాత్రి రెండుజాముల పిదప సెకండులో ఒక శిశువు కల్గిందని. ఇలాంటి వారికి ప్రతియేడు జన్మదినము వేడుకలు ప్రపంచమంతట జరుగుతాయి. ఎవరి కొఱకు వ్యక్తిగతంగా ఆశుభాకాంక్షలు సన్నహమయినవో తెలియకుండానే. ఈఉదాహరణలో అక్షరాల నిజమైన వాక్యం ఈ వ్యాసంలోని ప్రప్రథమ వాక్యం. దాని అంతరార్థం ఏమంటే ప్రపంచానికి ఆనందకరము, క్షేమకరము అయిన విషయం ప్రతివ్యక్తి యొక్క ఆనందానికి క్షేమానికి ప్రత్యామ్నాయము అని!

***